క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



గోకులం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: పల్లెపండుగ పేరిట మండలంలో ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఒమ్మి గ్రామంలో జరుగుతున్న పనులను చూసి ఆయన.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని, ఆ దిశగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ కె.సతీష్‌కుమార్, తహసీల్దారు ఎం.శ్రీను హెచ్చరించారు. స్థానిక గొల్లవీధిలో బాలయేసు చర్చి నిర్మాణ విషయమై ఓ ఇరువర్గాల మధ్య స్వల్ప వివాదం తలెత్తగా, ఆ ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు శనివారం పిలిపించి, కౌన్సిలింగ్ ఇచ్చారు. వివాదాస్పద ప్రాంతంలో పోలీస్ పికెట్ కొనసాగుతుందని, అందరూ సామరస్యంగా ఉండాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడవద్దన్నారు.

నిధులు మంజూరు చేస్తాం



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకప్రియా ఆస్పత్రి భవనం మరమ్మతులకు నిధులు కోరగా, నిధులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎంఈవో కార్యాలయం మరమ్మతులకు కూడా రూ.2 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సిరిపురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



మహిళలకు సూచనలిస్తున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని ఏపీఎం బి.గోవిందరావు సూచించారు. మండలంలోని వావిలవలస, చినలింగాలవలస, పెదలింగాలవలస, తోకలవలస గ్రామాల్లోని డ్వాక్రా సంఘాల మహిళలతో శనివారం సమావేశమైన ఆయన.. రుణ బకాయిలు లేకుండా చూడాలని తెలిపారు. ఏ గ్రూపు పరిధిలోని రుణాలు ఆ గ్రూపు సభ్యులు సమయానికి చెల్లించేలా గ్రూపు లీడర్లు చూడాలన్నారు.

ట్రాఫిక్ అవస్థలు



రామభద్రపురం రోడ్డులో నిలిచిన వాహనాలు

రామభద్రపురం: మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. నాలుగు రాష్ట్రాల కూడలి కావడంతో పాటు సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణీకుల రాకపోకలు అధికంగా ఉండడం వల్ల ఈ సమస్య ఇప్పుడు జటిలమైందని స్థానికులు అంటున్నారు. ప్రతిరోజూ గంటల కొద్దీ వాహనాలు రోడ్లపైనే నిలిచిపోతున్నాయని, దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించే ప్రయత్నం చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా రోడ్డు ఆక్రమణలు తొలగించి, రోడ్డును విస్తరించాలని అలా చేస్తే కానీ ట్రాఫిక్ అవస్థలు ఉండవన్నారు.

గోశాలలు ప్రారంభం

తెర్లాం: మండలంలోని నందిగాం, తెర్లాం, కూనాయవలస, పణుకువలస, ఆమిటి, అరసబలగ, లింగాపురం, కొల్లివలస గ్రామాల్లో కొత్తగా నిర్మించిన గోశాలలను ఎంపీడీవో రేగి రాంబాబు శనివారం ప్రారంభించారు. పాడిరైతుల సౌకర్యార్థం జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన ఈ నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు జి.సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి, పారాది, బంకురువలస గ్రామాల్లోని గోశాలల(గోకులాలు)ను పశుసంవర్ధక శాఖ ఏడీ విష్ణు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్‌డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారం.. గ్రంథాలయం!

- గ్రంథాలయాలతో జ్ఞాన సముపార్జన
- చదువులమ్మ చెట్టులా విరాజిల్లుతున్న కంచరాం లైబ్రరీ
- గ్రామస్తుల సహకారంతో విజయవంతంగా నిర్వహణ
- ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పాఠకులు 50 మంది
- నేడు ప్రజాగ్రంథాలయ 11వ వార్షికోత్సవం



కంచరాంలో ఏర్పాటు చేసిన ప్రజాగ్రంథాలయం

రాజాం సిటీ: దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. ఒట్టిమాటలు కట్టిపెట్టి.. గట్టిమేల్ తలపెట్టవోయ్.. అనే గురజాడ మాటలకు అచ్చం.. ఆ గ్రంథాలయ నిర్వాహకులు చేసి చూపిస్తున్నారు. ఓ మంచి పుస్తకం సమాజ అభివృద్ధికి తోడ్పడితే గ్రంథాలయం ఏకంగా సమాజ మార్పునకు నాంది పలుకుతుందని బలంగా విశ్వసించారు. అందరికీ ఉపయోగపడేలా లైబ్రరీని ఏర్పాటు చేసి విజయవంతంగా దానిని నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. కంచరాం గ్రామస్తులు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని, వాటిని సద్వినియోగం చేసుకుంటే దేశాభివృద్ధికి ఉపయోగమని నమ్మి ఆ గ్రామ ఉపాధ్యాయులు, ఔత్సాహికులంతా 2013 అక్టోబరు 2వ తేదీన గ్రామంలో గ్రంథాలయం స్థాపించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకుని, 50 మంది పాఠకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం ఉద్యోగాలు సాధించిన వారంతా గ్రంథాలయ అభివృద్ధికి గ్రామస్తులతో పాటు సహకరిస్తుండడం విశేషం.

సంక్రాంతే అక్కడ గ్రంథాలయ పండగ..

జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని, ఏటా జనవరి 12వ తేదీన గ్రంథాలయ వార్షికోత్సవం నిర్వహించుకోవడాన్ని గ్రామస్తులు ఆనవాయితీగా చేసుకున్నారు. ప్రతీ వార్షికోత్సవానికి ప్రముఖ వ్యక్తులతో గ్రామానికి చెందిన యువత భవిష్యత్‌లో సాధించాల్సిన విజయాలపై సందేశమిస్తున్నారు. సంక్రాంతి పండగ అంటే అందరికీ గుర్తొచ్చేది.. చుట్టాలు, బంధువులు, కూతుళ్లు, కొత్త అల్లుళ్లు, పిండి వంటకాలు.. కానీ ఆ గ్రామస్తులకు మాత్రం అక్కడి గ్రంథాలయమే పండగ. మూడు రోజుల పాటు నిర్విరామంగా గ్రంథాలయాభివృద్ధికి కార్యాచరణ రూపొందించడమే లక్ష్యంగా చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా కృషి చేస్తుంటారు. గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి చందాలు సేకరించడంతో పాటు ఆ సంవత్సరంలో అయిన ఖర్చుల వివరాలను ప్రతీ ఇంటికి కరపత్రం రూపంలో తెలియజేస్తారు. ఇదే పారదర్శకత గ్రామస్తుల్లో గ్రంథాలయ అభివృద్ధికి మరింత ఉత్సాహాన్నిస్తోంది. ప్రతిఏటా రూ.1.50 లక్షల వరకు చందాలు వసూలు చేసి, గ్రంథాలయ అభివృద్ధికి వినియోగిస్తారు.

రేకుల షెడ్డు నుంచి శాశ్వత భవనానికి..

అంతవరకు రేకుల షెడ్డులో నిర్వహించిన గ్రంథాలయానికి శాశ్విత భవనం అవసరంగా కమిటీ సభ్యులు గుర్తించారు. స్థానిక నాయకుల ద్వారా మండల పరిషత్ గ్రాంట్ నుంచి రూ.5 లక్షల వరకు నిధులు మంజూరు జరిగేలా చర్యలు తీసుకున్నారు. మొత్తం భవన నిర్మాణం పూర్తికి రూ.18 లక్షల వరకు ఖర్చు అవ్వగా మిగిలిన మొత్తాన్ని గ్రామస్తులే ఇచ్చారు. ఇలా పూర్తయిన గ్రంథాలయ శాశ్వత భవనాన్ని 2023 నవంబరు 14వ తేదీన ప్రారంభించారు. దీంతో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నిరుద్యోగ యువత, పాఠకులు కూడా ఈ గ్రంథాలయ సేవలు సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రంథాలయ సేవలను విస్తృతం చేసేందుకు గ్రామస్తులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. పెద్ద రీడింగ్ రూమ్, టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్, రన్నింగ్ వాటర్ వంటి సదుపాయాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. ఇప్పటికే బీడీసీగా గుర్తింపు పొందిన గ్రంథాలయం.. విలేజ్ గ్రంథాలయంగా గుర్తింపు పొందాల్సి ఉంది.



లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు



గ్రంథాలయంలో అందుబాటులో వివిధ పోటీ పరీక్షల పుస్తకాలు

గ్రూప్-2 మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్నా..



గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు.. ఎంతో సౌలభ్యంగా ఉంది. నాలాంటి విద్యార్థులు గ్రంథాలయం వినియోగించుకునే వీలు కల్పించడం సంతోషం. అందుబాటులో అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు ఉన్నాయి. ప్రస్తుతం నేను గ్రూప్–2 ప్రిలిమ్స్ అర్హత సాధించి, మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. నాతో పాటు మరో ఆరుగురు మెయిన్స్‌కు సిద్ధమవుతున్నారు.

–నక్కిట్ల చంద్రశేఖర్, గ్రంథాలయ పాఠకుడు, కంచరాం

జైలు వార్డర్‌గా పనిచేస్తున్నా..



గ్రామంలోని గ్రంథాలయంలో చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన 50 మందిలో నేనొకడిని. గ్రంథాలయంలోని పుస్తకాలే నాకు ఉద్యోగం సాధించేందుకు సహకరించాయి. ప్రస్తుతం నేను నెల్లూరు జైలు వార్డర్‌గా విధులు నిర్వహిస్తున్నా.

–రౌతు రమేష్, గ్రంథాలయ పాఠకుడు కంచరాం

ప్రజల సహకారం మరువలేనిది..



చదువుతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని భావించి, గ్రంథాలయ అభివృద్ధికి గ్రామస్తులు చేస్తున్న సహకారం మరువలేనిది. భవిష్యత్‌లో గ్రంథాలయ మరింత అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. గ్రామస్తుల సహకారంతోనే గ్రంథాలయ సేవలు మెరుగు సాధ్యం.

–పొదిలాపు శ్రీనివాసరావు, అధ్యక్షుడు, ప్రజాగ్రంథాలయం, కంచరాం

తిరుపతి తొక్కిసలాటకు భేదాభిప్రాయాలూ కారణమే..

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: తిరుమల తిరుపతి దేవస్థానంలో తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం, వందలాది మంది గాయాలపాలవ్వడం బాధాకరమని, దీనికి అక్కడి పాలకమండలి, అధికారుల మధ్య భేదాభిప్రాయాలూ ఓ కారణమేనని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. శ్రీవారి సన్నిధిలో జరిగిన ప్రాణనష్టం పూడ్చలేనిదే అయినా దాని వెనక ఉన్న నిర్లక్ష్యం మాత్రం సహించలేనిదన్నారు. ఈ ఘటన వెనక ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ ఘోర తప్పిదాన్ని కప్పిపుచ్చేందుకు సాక్షాత్తు సీఎం చంద్రబాబు పడుతున్న ఉబలాటాన్ని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. మరోవైపు సీఎం చంద్రబాబు సమక్షంలో తొక్కిసలాట ఘటనపై జరిగిన సమీక్షలో పాలకమండలి, అధికారుల మధ్య వెలుగుచూసినా భేదాభిప్రాయాలు.. పరిపాలన ఎంత మూర్ఖంగా సాగుతుందో చెప్పకనే చెబుతోందన్నారు. పవన్‌కల్యాణ్ చేసిన సూచనలు కూడా పరిగణలోకి తీసుకోవద్దని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ద్వారా సీఎం చంద్రబాబు చెప్పకనే చెప్పినట్లు ఉందన్నారు. లోపల ఒకలా.. బయటకు ఒకలా ప్రవర్తించడం చంద్రబాబు నైజమన్నారు. గతంలో తిరుపతి లడ్డూ నాణ్యతపై లేనిపోని హంగామా చేసి, ఇప్పుడు ఇంత ఘోరం జరిగినా నోరు మెదపరేంటని నిలదీశారు. రాష్ట్ర ప్రజలకు తప్పకుండా సమాధానం చెప్పాలని, లేకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఆయన వెంట తెర్లాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ త్రినాధనాయుడు తదితరులు ఉన్నారు.

పరామర్శ



చిన్నబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ రాజేష్

రాజాం: పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త జీఎంఆర్ సోదరుడు గ్రంధి చిన్నబాబును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు శనివారం పరామర్శించారు. ఇటీవల చిన్నబాబు భార్య సరస్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వారు.. వారి ఇంటికి వెళ్లి, ఆమె మృతికి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట పార్టీ నేతలు కె.సుదర్శనరావు, పి.గోపి, పి.సత్యనారాయణ గుప్తా, పి.దవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

వంగర: హిందూ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. మండలంలోని కోణంగిపాడు గ్రామ రామాలయంలో శనివారం పూజలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని, రోజులో ఏదో ఒక సమయాన్ని దైవనామ స్మరణకు కేటాయించాలని తెలిపారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



రాజాం సిటీ: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

రామభద్రపురం: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలంతా కేంద్రాలకు హాజరైన చిన్నారులకు పండగ విశిష్టత, ఉత్సవం జరుపుకోవడం వంటివి తెలియజేసి, వారితో రంగురంగుల ముగ్గులు వేయించారు. అనంతరం వారితో ఆటపాటలు వంటివి చేయించి, పండగ సరదాను వారిలో తీసుకువచ్చారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని రాజచెరువువలస, మోసురువలస తదితర గిరిజన గ్రామాల్లో వనమిత్ర కృష్ణదాస్ ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ వారు ముందస్తు సంక్రాంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గిరిజన చిన్నారులు వేసిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.



రాజాం సిటీ: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

రాజాం సిటీ: పట్టణంలోని జీసీఎస్ఆర్ కళాశాల వద్ద ముందస్తు సంక్రాంతి సంబరాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ముగ్గుల పోటీల్లో పలువురు విద్యార్థినులు అందమైన రంగవల్లులు వేసి, అలరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లికి చెందిన బోనెల విజయలక్ష్మికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే బేబీనాయన శనివారం అందజేశారు. ఆమె అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు అధిక నిధులు అవసరం కానుండడంతో ఆర్థికసాయం చేయాలని సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు ఆమెకు రూ.80 వేలు మంజూరైంది.

అప్రమత్తంగా ఉండాలి

సంతకవిటి: పండగ వేళ ఎక్కువగా దోపిడీ, దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు సూచించారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ ఏ ఊరు అయినా వెళ్తే ఇంటికి తాళాలు సక్రమంగా వేసి, తాళాలను పట్టుకువెళ్లిపోవాలన్నారు. విలువైన బంగారు, వెండి వస్తువులను వెంట తీసుకువెళ్లాలన్నారు. పందాలు, డీజేలకు అనుమతి లేదన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు

బొబ్బిలి: సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎక్కడైనా కోడిపందాలు, పొట్టేళ్ల పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కె.సతీష్‌కుమార్, తహసీల్దారు ఎం.శ్రీను హెచ్చరించారు. ఇదే విషయమై వారు మండలంలోని ఎ.వెలగవలస గ్రామంలో పందాలు వేస్తూ పట్టుబడిన వారికి వేసే శిక్షలపై శనివారం అవగాహన కల్పించారు. పండగ వేళల్లో ఎక్కువగా దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కూడారై పూజలు



రేగిడి: పనసలవలసలో స్వామి వారికి నివేదించిన ప్రసాదాలు

బొబ్బిలి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని వేంకటేశ్వరాలయంలో కూడారై పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాన్ని అత్యంత సుందరంగా అలంకరించి, స్వామికి ప్రత్యేక పూజల అనంతరం ప్రసాదాలను నివేదించారు. ధనుర్మాసంలో 27వ పాశురం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

రేగిడి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పనసలవలస శ్రీరాజవేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారికి 108 గంగాళాలతో కూడారై ప్రసాదం నివేదించారు.

పల్లెపండుగ పనుల్లో నాణ్యత కరువు



ఇప్పలవలసలో ఇంతకుముందు ఉన్న కాలువపైనే కాలువ నిర్మాణం చేస్తున్న దృశ్యం

మెంటాడ: పల్లెపండుగ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులు చేస్తున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాల్లో నాణ్యత కరువవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణాల్లో ఎక్కడా నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, అధికారులు కూడా కూటమి నాయకులకు వత్తాసు పలుకుతూ నిబంధనలు తుంగలోకి తొక్కుతున్నారని విమర్శిస్తున్నారు. కనీసం కూలీలను కూడా పనిలో పెట్టుకోకుండా ఏకంగా యంత్రాల సాయంతో కొద్దిరోజుల్లో త్వరితగతిన నాణ్యత లేకుండా పనులు చేసేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందంటున్నారు. ఇప్పలవలస గ్రామంలో గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాలువపైనే మళ్లీ కాలువ పనులు చేసి బిల్లులు డ్రా చేసుకునేందుకు నాయకులు సిద్ధమయ్యారు. ఇదే విషయమై మండల ఇంజినీరింగ్ జేఈఈ గౌతమ్‌ను వైఎస్సార్ సీపీ నాయకుడు గేదెల రామకృష్ణ ప్రశ్నించగా, నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరుతున్నారు.

కరెంట్ బిల్లులను భోగి మంటల్లో వేయండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి: కరెంట్ బిల్లులను భోగి మంటల్లో వేసి, ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వ్యతిరేకించాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు పిలుపునిచ్చారు. ఇదే విషయమై స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని చంద్రబాబు హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని పూర్తిగా విస్మరించి, ఎడపెడా విద్యుత్ చార్జీలు పెంచారని విమర్శించారు. ఆరు నెలల్లో రెండుసార్లు విద్యుత్ ట్రూఅప్ చార్జీలు పెంచి, ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. అలాగే స్మార్ట్ విద్యుత్‌మీటర్ల ఏర్పాటును కూడా తీవ్రంగా వ్యతిరేకించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు చెల్లించండి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలం

బొబ్బిలి: ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద శనివారం విలేకరులతో మాట్లాడారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ధాన్యం రవాణా చార్జీలను సొసైటీలకు చెల్లించినప్పటికీ రైతులకు అధికారులు చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా రవాణా చార్జీలను వెంటనే రైతులకు ఇవ్వాలని లేకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

దొడ్డిదారిన ఐరన్ స్క్రాప్..



గాయత్రి కాలనీ సమీపంలో ఓ షాపు నుంచి లారీతో తరలిస్తున్న స్క్రాప్



ఇలా ఆర్టీసీ లాజిస్టిక్ వాహనాల ద్వారా బ్యాటరీల తరలింపు

రాజాం: పట్టణ పరిధిలోని పలు దుకాణాల నుంచి ఐరన్ స్క్రాప్ దొడ్డిదారిన హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు తరలివెళ్తోంది. ఇక్కడ 14కు పైగా స్క్రాప్ షాపులు ఉన్నాయి. వీటికి పలు గ్రామాల నుంచి చిల్లర వర్తకులు పాత ఇనుప సామగ్రి తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. వీటితో పాటు షాపుల వద్ద అక్రమంగా పాత కార్లు, ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసి అమ్మకాలు చేస్తుంటారు. ఇటీవల పట్టణంలో చీపురుపల్లి రోడ్డులోని ఓ షాపు నుంచి అక్రమ మార్గంలో స్క్రాప్ తరలిస్తున్నట్లు సీటీవో అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఇక్కడ నుంచి తరలిస్తున్న సామగ్రికి వేరే ప్రాంతం నుంచి అనుమతులు తీసుకువచ్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. అయితే పెద్ద పెద్ద లారీలు, వ్యాన్‌లతో పాటు బ్యాటరీలు వంటివి తరలించేందుకు ఆర్టీసీ లాజిస్టిక్ వాహనాలు వినియోగిస్తున్నట్లు పలువురు బాహాటంగానే చెబుతున్నారు. జీఎస్టీ నిబంధనలు అతిక్రమించి మరీ రవాణా చేస్తున్న సరుకుకు ఇక్కడ అనుమతులు లేకపోవడంతో ఇతర ప్రాంతాల కంపెనీల పేరుతో వీటిని తరలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ స్క్రాప్ తరలింపుపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

•సంక్రాంతికి వస్తున్నాం..!





అందరికీ ఎంతో ఇష్టమైన పండగల్లో సంక్రాంతి ఒకటి. గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత సందడిగా చేసుకునే ఈ వేడుకలకు దూరప్రాంతాల్లో వృత్తి, ఉద్యోగ, ఉపాధి రీత్యా స్థిరపడిన వారంతా ఏటా వస్తుంటారు. మరో రెండు రోజుల్లో పండగ ఆరంభం కానుండడంతో ఎక్కడెక్కడో ఉన్న వారంతా తమ సొంత ఊళ్లకు చేరుకుంటున్నారు. సరదాగా పండగ చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

–బొబ్బిలి, రేగిడి

చలికాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష

రామభద్రపురం: చలికాలంలో ఆరోగ్య రక్షణకు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని వైద్యాధికారులు దిలీప్‌కుమార్, ఏఎల్‌జీ శిరీష సూచించారు. ఇదే విషయమై స్థానిక పీహెచ్‌సీలో వారు శనివారం మాట్లాడుతూ రాత్రి వేళల్లో ఉష్ణోగ్రత పడిపోతోందని, దీంతో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని తెలిపారు. అప్రమత్తంగా ఉంటేనే వ్యాధుల బారిన పడకుండా ఉండగలమన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్నారుల ఆరోగ్యం కోసం మరింత జాగ్రత్త వహించాలన్నారు. నెలల బిడ్డలు తల్లి పొత్తిళ్లలో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలన్నారు. ఏడాది లోపు పిల్లలకు చలిగాలి తగలకుండా వెచ్చగా ఉండేలా చూసుకోవాలని, చలితో ఫిట్స్ వచ్చే ప్రమాదముందన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు స్వెటర్లు, ఉన్ని దుస్తులు వేయాలి. అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించాలన్నారు.